రేపు పాడైన వస్తువుల సేకరణ

● సర్కిల్-18లో జీహెచ్‌ఎంసీ ప్రత్యేక డ్రైవ్

ఖైరతాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పనికిరాని, పాడైన వస్తువులను జీహెచ్‌ఎంసీ సేకరించనుంది. శనివారం సర్కిల్-18(జూబ్లీహిల్స్)లో ఆ వస్తువులను సేకరించేందుకు ప్రతీ వార్డులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఉపకమిషనర్ ప్రశాంతి తెలిపారు. షేక్‌పేట డివిజన్‌లోని లక్ష్మీనగర్, జూబ్లీహిల్స్ డివిజన్‌లోని కమలాపురి కాలనీ, బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది అందుబాటులో ఉండి సేకరిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి తమ బృందాలు అందుబాటులో ఉంటాయని, పనికిరాని వస్తువులు, పాడైన ఫర్నిచర్, వినియోగంలో లేని వస్తువులను తీసుకుంటారని ప్రశాంతి పేర్కొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ రీజనల్ సీఈవో దేవానంద్

క్లినికల్ రీసెర్చ్‌లలో కీలకంగా మారనున్న ఏఐ

బంజారాహిల్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో క్లినికల్ రీసెర్చ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకంగా మారబోతున్నదని ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ రీజనల్ సీఈవో దేవానంద్ కె అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీలో నాలుగు రోజులుగా జరుగుతున్న క్లినికల్ రీసెర్చ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సర్టిఫికెట్ కోర్సు గురువారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయనతోపాటు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం దేవానంద్ మాట్లాడుతూ.. ఫార్మసీ విద్యార్థులకు ఇలాంటి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఫార్మసీ రంగంలో వస్తున్న మార్పులను తెలుసుకోగలుగుతారన్నారు. కోర్సులో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతోపాటు ప్రాక్టికల్ స్కిల్స్‌ను విద్యార్థులకు నేర్పించినట్లు క్లినికల్ డైరెక్టర్ మితేష్‌రెడ్డి, సేఫ్‌విగ్ సీఈవో శ్రీ దివ్య తెలిపారు. క్లినికల్ రీసెర్చ్‌తోపాటు గుడ్ క్లినికల్ ప్రాక్టీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, క్లినికల్ డాటా మేనేజ్‌మెంట్ అంశాలపై విద్యార్థులకు వివరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కినోసోల్ ఫౌండర్ ముజీబుద్దీన్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని బంజారాహిల్స్ ఏడీఈ జి. గోపి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వీఎల్‌సీసీ, అయ్యన్న ప్రైడ్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు షాపింగ్ కాంప్లెక్స్, గుట్టల బేగంపేట ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అల్లావుద్దీన్ కోటి, బీకే గూడ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సనత్‌నగర్‌లోని కాలుష్య నియంత్రణమండలి, కుందన్‌బాగ్‌లోని ట్రాన్సిట్ హోటల్ ఫీడర్ల పరిధుల్లో పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో మహాపడి పూజ

పంజాగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమాజిగూడ అయ్యప్పస్వామి ఆలయంలో ఆర్. శ్రీనివాస్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో 33వ మహాపడి పూజ గురువారం వైభవంగా జరిగింది. అనంతరం అయ్యప్పలకు భిక్ష ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు సంతోష్ గుప్తా, రామన్ గౌడ్, వనం శ్రీనివాస్ యాదవ్, కళ్యాణ్ దాస్, రాంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వీజేసీ ఓవర్సీస్ సంస్థకు

ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ బ్రాండ్ అవార్డు

పంజాగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్‌లోని వీజేసీ ఓవర్సీస్ సంస్థకు ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ బ్రాండ్ అవార్డు లభించింది. బెంగుళూరుకు చెందిన షై బ్రాండ్ బెటర్ సంస్థ ప్రతి సంవత్సరం సర్వే నిర్వహించి విద్యార్థులకు విద్యాభ్యాసంలో అత్యుత్తమ సేవలు అందించే సంస్థలను గుర్తించి వారికి అవార్డులను అందజేస్తోంది. ఈ సంవత్సరం నిర్వహించిన సర్వేలో తమ సంస్థ అత్యుత్తమ స్థానంలో నిలిచి ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ బ్రాండ్ అవార్డును ఇటీవల బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటి అదా శర్మ చేతుల మీదుగా అందుకున్నామని సంస్థ డైరెక్టర్ డాక్టర్ మణి ఉత్తరాది గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.



సినీనటి అదా శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మణి ఉత్తరాది

ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు

జాతీయ పురస్కారాలు నేడు

హైదరాబాద్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మహిళాభివృద్ధి సొసైటీ (ఏపీమాస్) ఆధ్వర్యంలో శుక్రవారం యూసఫ్‌గూడలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (నిమ్స్ మే)లో ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు అందజేయనున్నారు. ఏపీమాస్ 23 ఏళ్లుగా హైదరాబాద్ కేంద్రంగా మహిళా సాధికారత సాధన, పేదరికం తగ్గుదల కోసం కృషి చేస్తోందని నిర్వాహకులు శ్రీనివాస్, విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు జరగనున్న కార్యక్రమానికి దేశంలోని 22 రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, అభివృద్ధిరంగ నిపుణులు, బ్యాంకర్లు, ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని వారు తెలిపారు.

మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే లక్ష్యం

● క్లాసిక్ మిసెస్ ఆసియా ఇంటర్నేషనల్ విజేత డా. విజయ శారదా రెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మిసెస్ ఏసియా ఇంటర్నేషనల్-2024 టైటిల్ విజేత డాక్టర్ విజయశారదా రెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీలోని చిరు గ్రామంలో జన్మించిన తనకు డిగ్రీ రెండో సంవత్సరంలోనే వివాహం అయిందన్నారు. భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్య పూర్తి చేశానని, విద్య ద్వారానే విజ్ఞానం లభిస్తుందని బలంగా నమ్మి విద్యాసంస్థలను నెలకొల్పినట్లు చెప్పారు.



కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతున్న డాక్టర్ విజయ శారదారెడ్డి

వయస్సు శరీరానికేనని మనసుకు కాదని ప్రతి మహిళకు వివరించే లక్ష్యంతో అందాల పోటీలకు సిద్ధమయ్యానన్నారు. కుటుంబ సభ్యులు సైతం తన నిర్ణయాన్ని సమర్థించి ప్రోత్సహించడంతో అంతర్జాతీయ వేదికపై టైటిల్‌ను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఇది కేవలం తన కోసం చేసింది కాదని, చిన్న చిన్న కారణాలతో ఇంటికి పరిమితం అవుతున్న మహిళలలో అంతర్లీనంగా ఉన్న శక్తిని ప్రేరేపించే లక్ష్యంతో చేస్తున్నట్లు చెప్పారు.

నమ్మకద్రోహులు

● అన్నం పెట్టిన ఇళ్లకే కన్నం వేస్తున్న కొందరు ● హిల్స్ ఠాణాల్లో నిత్యం నమోదవుతున్న కేసులు



"డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బంజారాహిల్స్‌లో ఓ ఇల్లు ఉంది. ఆయన కుటుంబంతో సహా ప్రగతిభవన్‌కు మారిన తర్వాత బంజారాహిల్స్‌లోని ఇంట్లో కొన్ని వస్తువులు అలాగే ఉంచడంతోపాటు ఆఫీసు కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఆ ఇంటికి వాచ్‌మన్‌గా బిహార్‌కు చెందిన ఓ యువకుడు ఉన్నాడు. ఇంట్లోని విలువైన వస్తువులపై అతడు కన్నేశాడు. స్నేహితులకు విషయం చెప్పి పథకం వేశాడు. ఓ రోజు వస్తువులను చోరీ చేసి స్నేహితులతో కలిసి పారిపోయాడు. సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. బిహార్ నుంచి రైలులో వచ్చిన అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది".

" సాహితీ ఇన్‌ఫ్రా లక్ష్మీనారాయణ కోడలి ఇంట్లో ఏపీకి చెందిన సురేష్ కొద్ది కాలంగా పనిచేస్తున్నాడు. లక్ష్మీనారాయణ కోర్టు కేసులతో సతమతమవుతుండటంతో కొద్ది రోజుల క్రితం ఆయన కోడలు ఇంటిని పనివారికి అప్పగించి ఊరెళ్లింది. ఆమె తిరిగి నగరానికి రాగా ఇంట్లో నగదు, నగలు కనిపించకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా సురేష్‌తోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. డబ్బు, నగలను రికవరీ చేశారు".

బంజారాహిల్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొంతమంది అన్నం పెట్టిన ఇంటికే కన్నం వేస్తున్నారు. నమ్మకం వారి దొంగతనానికి పెట్టుబడి. వారి ఆదాయానికి రాబడి. పనిచేయడానికి వచ్చి పనికానిచ్చుకుని వెళ్తున్నారు. ఇలాంటి కేసులు హిల్స్ ఠాణాల్లో నిత్యం నమోదవుతున్నాయి.

అవగాహన రావాలి..

హిల్స్ పోలీస్‌స్టేషన్‌ల పరిధుల్లో జరుగుతున్న ఇలాంటి ఘటనలపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా కొన్ని ప్రయోగాలు సైతం చేశారు. పనిమనుషుల పూర్తి వివరాలు, ఫొటోలను సేకరించాలని ఇళ్ల యజమానులకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో పోలీసులు స్వయంగా సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలిచ్చారు.

బీరువా తాళాలు పనివారికి కనపడకుండా పెట్టాలని, వారి ఎదుట డబ్బు లెక్కపెట్టొద్దని, పని చేస్తున్న వారిని కొన్ని గదులకే పరిమితం చేయాలని సూచిస్తున్నారు. ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసులు చెప్పినా చాలా మందిలో మార్పు కనిపించడం లేదు. గతంలో జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 5లో వృద్ధ దంపతుల వద్ద పనిచేస్తున్న యువతికి యజమానులు అన్ని విషయాలు చెప్పారు. దీంతో ఆమె ఇంట్లో ఉన్న బంగారం చోరీ చేసి ప్రియుడికి లక్ష రూపాయల విలువగల ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి ఇచ్చింది. యజమానులకు అనుమానం వచ్చి ఫిర్యాదు చేయగా తమవద్ద పనిచేసే యువతే నిందితురాలని తేలింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా.. ప్రియుడికి ద్విచక్రవాహనం కొనిచ్చేందుకు చోరీ చేసినట్లు అంగీకరించింది.

నిర్లక్ష్యం వల్లే..

నమ్మకంగా ఉంటే.. మన అని భావించుకోవడం చాలామంది కొంప ముంచేందుకు కారణమవుతోంది. కొద్దిరోజులు నమ్మకంగా పనిచేసిన వారికి ఇల్లంతా అప్పగించి వెళ్లడం, ఆభరణాలను భద్రపరిచే ప్రాంతాన్ని వారికి చూపించడం, పడక గదిలోకి అనుమతించడం, ఇంటి యజమానుల నిర్లక్ష్యమే దొంగతనానికి కారణమవుతోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ లాంటి ప్రాంతాల్లో విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన ఇంటి యజమానులు కొందరు పనివాళ్లకు అన్ని పనులనూ అప్పగించడంతోపాటు అన్ని గదుల్లోకి అనుమతిస్తున్నారు. దాంతో వారికి ఎక్కడ ఏమున్నదో తెలిసిపోతున్నది.

జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 5లో యజమానుల నిర్లక్ష్యం కారణంగా సుమారు కోటి రూపాయల విలువ చేసే ఆభరణాలు చోరీ అయ్యాయి.

వివరాలు తెలుసుకోండి

ఎవరినైనా ఇంట్లో పనికి పెట్టుకుంటే వారి వివరాలు తెలుసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. వారు అంతకు ముందు ఎక్కడ పనిచేశారు, పని తీరు ఎలా ఉందో ఆరా తీయాలంటున్నారు.

- పనిలో చేరే వారి గుర్తింపు కార్డు, ప్రస్తుతం నివసించే ఇంటి చిరునామా, సొంత ఇంటి చిరునామా, ఫొటోను తప్పనిసరిగా తీసుకోవాలి.
- వాళ్ల గురించి స్థానికంగా తెలిసిన వారు ఎవరైనా ఉంటే వారిని పరిచయం చేస్తూ ఓ లేఖను తీసుకోవడం మంచిది.
- వారికి ఏటీఎం కార్డులు ఇచ్చి పిన్ నంబర్లు చెప్పి డబ్బులు డ్రా చేయమని చెప్పొద్దు.
- పని మనుషులకు విలువైన వస్తువులను ఇచ్చి భద్రపర్చమని చెప్పొద్దు.
- ఊరికి వెళ్లేటప్పుడు నగలు, డబ్బు ఇళ్లల్లో ఉంచొద్దు.

నగరంలో కాశ్మీర్ అందాలు

● పీపుల్స్ ప్లాజాలో వింటర్ ఉత్సవ్ మేళా ప్రారంభం



మేళాను ప్రారంభిస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మైనస్ 5 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య మంచు కురుస్తుండగా కాశ్మీర్ అందాలను స్వయంగా చూస్తున్నట్లు అనుభూతి పొందేలా ఏర్పాటైన వింటర్ ఉత్సవ్ మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పీపుల్స్ ప్లాజా మైదానంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, సోమాజిగూడ కార్పొరేటర్ సంగీతా శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. కాశ్మీర్‌లో కనిపించే మంచు కొండలు, వాటర్ ఫాల్స్, అక్కడి జంతువులు, వాతావరణం, ఇళ్లు కళ్లకు కట్టేలా తయారు చేయగా.. సందర్శకులు ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. దాదాపు రెండువందల స్టాళ్లలో దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ వస్తువులను ప్రదర్శనతోపాటు అమ్మకానికి ఉంచారు. చలి కాలంలో ధరించే స్వెటర్లు, టోపీలు, పలు రకాల దుస్తులతో పాటు గృహోపకరణాలు, కాస్మెటిక్స్, తిను బండారాలతో కూడిన స్టాళ్లలో సందర్శకులు సందడి చేస్తున్నారు. ప్రదర్శన ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు 45 రోజులపాటు కొనసాగుతుందని నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్ తెలిపారు.

మేళాలో కనువిందు చేస్తున్న కాశ్మీర్ అందాలు



భారీ వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

హైదరాబాద్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఆటోనగర్‌లోని హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వారి ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో టాటా గ్రూప్ సంస్థ టైటాన్ ఐ ప్లస్, హెచ్‌జీటీఏ సహకారంతో ఔటర్ టోల్ వసూళ్ల ఏజెన్సీ ఐఆర్‌బీ సంస్థ ఆధ్వర్యంలో భారీ వాహనాల డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డీసీపీ ప్రవీణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. వాహనదారులకు కంటి పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. శనివారం వరకు శిబిరాన్ని నిర్వహిస్తామని ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రతినిధులు ప్రకటించారు.

డీసీపీ మాట్లాడుతూ.. భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, హెచ్‌జీటీఏ అధ్యక్షుడు అజయ్‌శర్మ, హెచ్‌జీటీఏ ఉపాధ్యక్షుడు వినీల్, ఎన్‌ఓఆర్‌ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్నల్ గిరీశ్వర్, హెచ్‌జీసీఎల్ డీజీఎంలు చంద్రశేఖర్, రిజ్వాన్, ఏజీఎం మీనాక్షి, ఐఆర్‌బీ ప్రతినిధులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

పర్యాటకుల కోసం గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలు

ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్ ప్యాకేజీలను ప్రకటించిన ఐఆర్‌సీటీసీ

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన ప్రయాణంతో విహారయాత్రలకు వెళ్లి వచ్చే పర్యాటకుల కోసం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును అందుబాటులోకి తీసుకొచ్చింది. 80 మంది విలాసవంతంగా ప్రయాణించేందుకు అనువుగా 13 డబుల్ బెడ్‌ల క్యాబిన్‌లు, 26 ట్విన్ బెడెడ్ క్యాబిన్‌లతో పాటు అత్యంత ఆధునిక వసతి సౌకర్యాలతో ఐఆర్‌సీటీసీ ప్రత్యేక గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును విహారయాత్రలకు వెళ్లి వచ్చేందుకు ఐఆర్‌సీటీసీ సిద్ధం చేసింది. అన్నిరకాల చానెళ్లను తిలకించేందుకు టీవీలను సైతం క్యాబిన్‌లో ఏర్పాటు చేసింది. వినోదం, విశ్రాంతి కోసం లగ్జరీ రైలులో ప్రత్యేకంగా స్పా, స్పాథెరపీలను ఆస్వాదించేందుకు ఏర్పాట్లున్నాయి. రుచి, నలపాక్ పేరుతో రెండు అద్భుతమైన రెస్టారెంట్‌లు అందుబాటులో ఉన్నట్టు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. స్థానిక రుచికరమైన వంటకాలతో పాటు మద్యం ప్రియులకు అవసరమైన రకరకాల పానీయాలను సైతం ఇక్కడి బార్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు.

ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ బెంగళూరు నుంచి బందీపూర్, మైసూర్, హళేబీడు, చిక్కమంగళూరు, హంపి, గోవా సందర్శించిన తర్వాత తిరిగి ఆరు రోజుల్లో బెంగళూరు చేరుకునేందుకు అనువుగా టూర్ ప్యాకేజీ ఖరారు చేశారు. జువెల్స్ ఆఫ్ సౌత్ ప్యాకేజీలో బెంగళూరు నుంచి మైసూర్, కాంచీపురం, మహాబలిపురం, తంజావూరు, చెట్టినాడ్, కొచ్చిన్, చేరాలా ప్రాంతాలను సందర్శించి ఆరు రోజుల్లో తిరిగి బెంగళూరుకు చేరుకునేందుకు వీలుగా మరో ప్యాకేజీ ప్రకటించారు. రైలు డిసెంబరు 14న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, డిసెంబరు 21న జువెల్స్ ఆఫ్ సౌత్, 2025 జనవరి 4, ఫిబ్రవరి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్, ఫిబ్రవరి 15న జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్, మార్చి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

వివరాలకు 918585931021 లేదా www.goldenchariot.org, Email: goldenchariot@irctc.com సంప్రదించవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.



లగ్జరీ రైలులో రెస్టారెంట్

'మత్తు' నిర్మూలనలో యువత భాగస్వామ్యం

● యూనివర్సిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులకు టీజీ న్యాబ్ అవగాహన కార్యక్రమాలు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు పదార్థాల కట్టడి, నిర్మూలనలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) యువతను భాగస్వామ్యం చేస్తోంది. ఇందులో భాగంగానే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో వచ్చే వారం రెండు రోజుల పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఈనెల 27, 28 తేదీల్లో రెండు విడతలుగా టీజీ న్యాబ్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ఈ తరహా అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు వెల్లడించారు.

పెట్టుబడి పెడితే రెండింతల లాభమంటూ మోసం

బంజారాహిల్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడి పెడితే రెండింతల లాభం వస్తుందని వచ్చిన పోస్టు ద్వారా ఓ ఉద్యోగి రూ. 30 వేలు మోసపోయాడు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 శ్రీరాంనగర్‌కు చెందిన కె. కృష్ణ ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 15న మిత్రుడి ద్వారా ఇన్‌స్టాలో వచ్చిన పోస్టు అతడిని ఆకర్షించింది. పెట్టుబడి పెడితే రెండింతల లాభం వస్తుందని అందులో ఉంది. లింక్ ఓపెన్ చేసి వెయ్యి రూపాయలు పంపించాడు. మరుసటి రోజు ఖాతాలోకి రూ. 1,200 వచ్చాయి. రూ. 30 వేలు కడితే లాభం రెట్టింపు వస్తుందని ఓ మెసేజ్ వచ్చింది. కృష్ణ రూ. 30 వేలు జమచేశాడు. కానీ డబ్బు తిరిగి రాలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేసి యువతిని మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన యువతి జూబ్లీహిల్స్‌లో ఓ యూ ట్యూబ్ చానెల్‌లో పనిచేస్తోంది. ఐదేళ్ల క్రితం హరీష్ అనే యువకుడితో సహజీవనం చేసింది. ఏడాది క్రితం అతడు ఆమెను మోసం చేసి మరో యువతిని వివాహం చేసుకున్నాడు. దీంతో ఆమె అతడిని పట్టించుకోవడం మానేసింది. హరీష్ కొద్ది రోజుల నుంచి ఆమె వెంట పడుతున్నాడు. ఈనెల 18న కార్యాలయానికి వెళ్లి అందరి ఎదుట దుర్భాషలాడాడు. లిఫ్టులో కిందకు దిగుతున్నప్పుడు ఆమెను కొట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

బంజారాహిల్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి ఒకరు మృతి చెందారు, మరొకరు గాయపడ్డారు. బిహార్‌కు చెందిన మహ్మద్ తయాం మియా బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి చాంద్రాయణగుట్టలో ఉంటూ కూలి పనిచేస్తున్నాడు. టోలీచౌకిలోని ఎస్ కాలనీలో ఈనెల 20న ఓ భవనం ఐదో అంతస్తులో ముఖేష్ అనే మరో కూలీతో కలిసి పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఇద్దరూ కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి తయాం మియా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బావ ఖయ్యూం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్‌ఆర్‌బీ పరీక్షలకు 42 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి జరగనున్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి 42 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం తెలియజేశారు. 24, 25, 26, 28, 29వ తేదీల్లో గుంటూరు- సికింద్రాబాద్(07101), 24, 25, 26, 28 తేదీల్లో సికింద్రాబాద్- గుంటూరు(07102), కరీంనగర్- కాచిగూడ (07103), కాచిగూడ- కరీంనగర్ (07104), 23న నాందేడ్- తిరుపతి (07105), 24న తిరుపతి- నాందేడ్ (07106), 24, 26, 28, 29 తేదీల్లో కాకినాడ టౌన్- తిరుపతి (07107), తిరుపతి- కాకినాడ టౌన్ (07108) 24, 25, 26 తేదీల్లో కాచిగూడ- కర్నూల్ సిటీ (07109), కర్నూల్ సిటీ- కాచిగూడ (07110), 24, 25, 26, 27 తేదీల్లో హుబ్లీ- కర్నూల్ సిటీ (07315), 25, 26, 27, 28 తేదీల్లో కర్నూల్ సిటీ- హుబ్లీ (07316) ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

సికింద్రాబాద్-వాడీ మధ్య రైల్వే ట్రాక్ కోసం స్థల సేకరణ

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య నాలుగు లైన్‌లుగా విస్తరించే పనులు చేపట్టడానికి అవసరమైన స్థల సేకరణ కార్యక్రమాన్ని దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. సనత్‌నగర్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య సుమారు 173.18 కిమీ దూరం భవిష్యత్ అవసరాలకు మూడు నుంచి నాలుగు లైన్‌ల ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు రైల్వే బోర్డు ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టడానికి అనుమతించింది. హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతోపాటు కర్ణాటకలోని కలబురిగి జిల్లాల్లో ప్రతిపాదించిన భూమిని ఆయా జిల్లా కలెక్టర్‌ల సహకారంతో సేకరించనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

తార్నాకలో హైటెన్షన్ వైర్లను తొలగించాలి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు

తార్నాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తార్నాకలో ప్రమాదకరంగా ఉన్న 32 కేవీ హైటెన్షన్ వైర్లను తొలగించాలని కాంగ్రెస్ నాయకులు, స్థానికులు కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, స్థానికులు గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్లుగా ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ తీగలతో ఇబ్బందులు పడుతున్నామని, విద్యుత్ ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోయారని వివరించారు. స్పందించి డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీపీసీసీ సెక్రటరీ అమర్‌నాథ్‌గౌడ్, తార్నాక డివిజన్ అధ్యక్షుడు బ్రహ్మాజీ, కాలనీవాసులు దుర్గయ్య, బాలరాజ్, రమేష్ కుమార్, శ్రీనివాస్, హనుమంతు, శశాంక్, పవన్ కుమార్, గోపాల్, క్రిష్ణ తదితరులున్నారు.

సమగ్ర కుటుంబసర్వేకు ప్రజలు సహకరించాలి



సీతాఫల్‌మండిలో సమగ్రకుటుంబ సర్వేలో ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

బౌద్ధనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్రకుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ కోరారు. గురువారం సీతాఫల్‌మండిలో జరుగుతున్న సమగ్రకుటుంబ సర్వే పనితీరును ఆయన పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి సర్వేచేసి వివరాలు సేకరిస్తున్నారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంధ్యారాణి, సికింద్రాబాద్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వరరావు, జహంగీర్, యాదగిరి, జగదీష్, పాపాలాల్, రాజేష్, దామోదర్, వేణుగౌడ్, కిషోర్, యూసీడీ అధికారిణి ధనశ్రీ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



టేబుల్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడలో చేపడుతున్న టేబుల్‌డ్రైన్ వర్క్ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ సామల హేమ గురువారం పరిశీలించారు. డ్రైన్‌వర్క్ పనులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దాదాపు రూ.50 లక్షలతో సీతాఫల్‌మండి చౌరస్తా నుంచి చిలకలగూడ చౌరస్తా వరకు టేబుల్ డ్రైన్ వర్క్ పనులు జరుగుతున్నాయన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారి పక్కనే పనులు జరుగుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేపల వేట మా జన్మహక్కు: దేశబోయిన రఘు



వారాసిగూడలో జెండాను ఆవిష్కరిస్తున్న తెలంగాణ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రఘు తదితరులు

బౌద్ధనగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గంగపుత్రులు ఐక్యంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దేశబోయిన రఘు సూచించారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను స్థానిక గంగపుత్ర సంఘం, గంగపుత్ర సంక్షేమ సంఘం, గంగపుత్ర సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వారాసిగూడలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రఘు గంగపుత్రుల జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. చేపలవేట మా జన్మహక్కని, ప్రతి యేడాది నవంబరు 21న గంగపుత్ర జెండా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె. సత్యనారాయణ, చల్లూరు సంజీవ్‌కుమార్, కుర శంకరయ్య, పారుపల్లి నరహరి, పాక సత్యనారాయణ, మల్లేశం, అంబటి రమేశ్, ముద్రగడ శివ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్‌లో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్న యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ ప్రతనిధులు

సికింద్రాబాద్‌లో యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ సర్వే

బౌద్ధనగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రభుత్వ అధికారుల అవినీతి, నాయకుల పనితీరుపై యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ రాష్ట్రవ్యాప్తంగా సర్వేను నిర్వహిస్తుంది. అందులో భాగంగా గురువారం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సర్వే నిర్వహించినట్లు యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ పల్నాటి రాజేంద్ర తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు అధికారుల ప్రవర్తన ఏలా ఉంది, లంచం డిమాండ్ చేస్తున్నారా, లంచాల కోసం పీడించే ప్రభుత్వశాఖలు ఏవీ, కొత్త ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది అనే అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. వారాసిగూడలో ప్రజలు, విద్యావేత్తలతో ఆన్‌లైన్ ద్వారా సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ కార్యదర్శులు కొన్నే దేవేందర్, కోమటి రమేష్ బాబు, సభ్యులు ఇబ్రహీం, రమేష్‌యాదవ్, సయ్యద్ నబీ, అశోక్, మహేశ్, హుస్సేన్, ఖలీల్, నరేష్, రమేష్, సలీమ్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంత్రాల్లో ఇద్దరి అదృశ్యం



శ్రావణి

బోయిన్‌పల్లి/అడ్డగుట్ట, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. తాడ్‌బంద్‌లో విద్యార్థిని, తుకారాంగేట్ మరాఠబస్తీలో ఓ మహిళ కనిపించకుండా పోయారు. వివరాల్లోకి వెళితే.. తాడ్‌బంద్‌లో నివాసముంటున్న సుందరగిరి ప్రసయ్య పెద్ద కుమార్తె ఎస్ శ్రావణి(24) బేగంపేట్‌లోని ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. బుధవారం కాలేజీకి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు గురువారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా యువతి ఓ యువకుడిని పెళ్లి చేసుకున్న ఫొటోలు కుటుంబ సభ్యులకు పంపించినట్లు ఎస్ఐ నాగేంద్రబాబు వెల్లడించారు.

తుకారంగేట్‌లో వృద్ధురాలు..



ఆశాబాయి

తుకారాంగేట్ మరాఠబస్తీకి చెందిన ఎల్. ఆశాబాయి(65) గత నెల 15న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దాంతో ఆదేరోజు తుకారంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాగా డీడీ ఎంట్రీ చేశారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు, పోలీసులు వృద్ధురాలు కోసం వెతికినా కనిపించలేదు. దాంతో తుకారాంగేట్ పోలీసులు గురువారం ఎఫ్ఐఆర్ చేసి మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. రెండు కేసులను నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

తిరుమలగిరి విలేజ్ — పార్కును అభివృద్ధి చేయండి

- చుట్టూ గోడను నిర్మించి వదిలేసిన అధికారులు
- పెరిగిన పిచ్చి మొక్కలు... సంచరిస్తున్న ఎలుకలు
- పక్కనే చెత్తకుండీ... వెలువడుతున్న దుర్వాసన



పార్కులో మొలిచిన పిచ్చి మొక్కలు



పార్కు పక్కన చెత్తకుండీ

తిరుమలగిరి నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులో దుర్వాసన వెలువడుతుంది. పార్కు చుట్టూ గోడను నిర్మాణం చేసిన అధికారులు పార్కులో పచ్చదనం కోసం మొక్కలను నాటకుండా వదిలేశారు. దాంతో పిచ్చి మొక్కలు మొలవ్వగా, అధ్వానంగా మారిన పార్కులో ఎలుకలు సంచరిస్తున్నాయి. పార్కు పక్కన ఉన్న చెత్తకుండీలో స్థానికులు చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి వేస్తున్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు పక్కన, ఇళ్ల మధ్యలో ఉన్న చెత్తకుండీలో చెత్త, వ్యర్థాలను వేయడంతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతుంది. దుర్వాసన కారణంగా చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల బారిన పడే అవకాశముందని తిరుమలగిరి విలేజ్ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. దోమల వృద్ధి సాయంత్రం ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. పార్కును ఏర్పాటు చేసిన అధికారులు అందులో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా కంటోన్మెంట్ అధికారులు స్పందించి తిరుమలగిరి విలేజీలోని పార్కను అభివృద్ధి చేయండని వారు కోరుతున్నారు. అదేవిధంగా పార్కు పక్కన ఉన్న చెత్తకుండీ, గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను తొలగించాలని స్థానిక మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పార్కుని అభివృద్ధి చేయకపోవడం, ఆ పక్కనే ఉన్న మరుగుదొడ్డి, డస్ట్‌బిన్‌ల వద్ద ఆహారం కోసం తిరుగుతున్న కుక్కలు ఇళ్లలోకి చొరబడి వంట చేసుకున్న ఆహార పదార్థాలను తినేస్తున్నాయని, వెళ్లగొట్టడానికి వెళ్తే దాడి చేస్తున్నాయని స్థానిక మహిళ మేరీ చెప్పారు.

ఎలుకలు ఇళ్లలోకి వస్తున్నాయి



పార్కులో చెత్తచెదారం కారణంగా ఎలుకలు సంచరిస్తున్నాయి. అవి ఇళ్లల్లోకి వచ్చి దుస్తులను కొరికివేస్తున్నాయి. పక్కన ఉన్న చెత్తకుండీ, మరుగుదొడ్డిలో కారణంగా విపరీతమైన దుర్వాసన వెలువడుతుంది. అధికారులు స్థానికంగా వచ్చి పరిస్థితిని పరిశీలించి వాటిని తొలగించి పార్కును అభివృద్ధి చేయాలి.

- అమ్లు మేరీ, తిరుమలగిరి విలేజ్

కమ్యూనిటీహాల్‌ను నిర్మించాలి



ప్రస్తుతం ఇక్కడ ప్రతి ఇంట్లో బాతూరూంలు ఉన్నాయి. అప్పట్లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను, పార్కు పక్కన ఉన్న డస్ట్‌బిన్‌ను వెంటనే తొలగించాలి. సామూహిక మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడంతో కంపుకొడుతున్నాయి. పక్కన పార్కును అభివృద్ధి చేయకపోడంతో చెత్తచెదారం నిండిపోయి పాములు, ఎలుకలకు ఆవాసంగా మారింది. వాటన్నింటిన తొలగించి తిరుమలగిరి విలేజ్ ప్రాంత వాసులకు కమ్యూనిటీహాల్ నిర్మించాలి లేదా వయోవృద్ధుల కోసం లైబ్రరీని ఏర్పాటు చేయాలి.

- హ్యారీ, తిరుమలగిరి విలేజ్

భారతీయ రైల్వే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ గెలుపు ఖాయం



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రచారం చేస్తున్న రైల్వే టీటీలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 4, 5, 6 తేదీలలో భారతీయ రైల్వే యూనియన్ల ఎన్నికలు జరుగుతున్నాయని, ఈ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ గెలుపు ఖాయమని దక్షిణ మధ్య రైల్వే టికెట్ చెకింగ్ బ్రాంచ్ కార్యదర్శి రాజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కరపత్రాలు పంచుతూ ఎన్నికలలో మజ్దూర్ యూనియన్ గెలిపించాలని ప్రచారం చేశారు. రైల్వేస్టేషన్ ముఖ్య టికెట్ పర్యవేక్షణ కార్యాలయంలో ఉద్యోగులు, టీటీలను కలిసి మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంత ముఖ్యమో రైల్వే సంస్థలో గుర్తింపు ఎన్నికల్లో ఓటు వేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఇటీవల రైల్వే ఉద్యోగాల్లో చేరిన ప్రతి ఒక్కరూ ట్రేడ్ యూనియన్ అవశ్యకతను గుర్తించి రైల్వే మజ్దూర్ యూనియన్‌కు మద్దతుగా నిలవాలన్నారు. నీతి నిజాయితీలతో పనిచేస్తూ కార్మికుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న రైల్వే ఉద్యోగుల కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే టికెట్ చెకింగ్ బ్రాంచ్ కార్యదర్శి అబ్దుల్ ఫరీద్, కోశాధికారి శివకుమార్, ఉపాధ్యక్షుడు ఏకే పాండే, సీనియర్ రైల్వే టికెట్ చెకింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి మజ్దూర్ యూనియన్ కృషి



బోయగూడ వైపు రైల్వే స్టేషన్ వద్ద ఎన్నికల ప్రచారం చేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల అండదండలతో కొన్ని కార్మిక సంఘాలు రైల్వే కార్మికులను మోసం చేస్తున్నాయని దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి పి.రవీందర్ అన్నారు. తమ సంఘం మాత్రమే రైల్వే కార్మికులు, ఉద్యోగులు సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదని అన్నారు. డిసెంబర్ 4, 5, 6 తేదీలలో జరిగే రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలలో మజ్దూర్ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ బోయగూడ వైపు మజ్దూర్ యూనియన్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రైల్వే కార్మికుల కోసం పుట్టిన మజ్దూర్ యూనియన్ సంఘం కార్మికులకు అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైల్వే క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ చిలుకు స్వామి పలువురు సీనియర్ ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మహిళాభివృద్ధి సొసైటీ (ఏపీమాస్) ఆధ్వర్యంలో శుక్రవారం యూసఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (నిమ్స్‌మే)లో ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు అందజేస్తున్నారు. ఏపీమాస్ 23 ఏళ్లుగా హైదరాబాద్ కేంద్రంగా మహిళా సాధికారత సాధన, పేదరికం తగ్గుదల కోసం కృషి చేస్తుందని నిర్వాహకులు శ్రీనివాస్, విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు జరుగనున్న కార్యక్రమానికి దేశంలోని 22 రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా స్వయం సహాయ సంఘాల ప్రతినిధులు, అభివృద్ధిరంగ నిపుణులు, బ్యాంకర్లు, ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

ఆర్ఆర్‌బీ పరీక్షల కోసం 42 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి 29 తేదీల మధ్య జరగనున్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి 42 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబరు 24, 25, 26, 28, 29 తేదీల్లో గుంటూరు- సికింద్రాబాద్ (07101), 24, 25, 26, 28 తేదీల్లో సికింద్రాబాద్- గుంటూరు (07102), కరీంనగర్- కాచిగూడ (07103), కాచిగూడ- కరీంనగర్ (07104), 23న నాందేడ్- తిరుపతి (07105), 24న తిరుపతి- నాందేడ్ (07106), 24, 26, 28, 29వ తేదీల్లో కాకినాడ టౌన్- తిరుపతి (07107), తిరుపతి- కాకినాడ టౌన్ (07108) 24, 25, 26వ తేదీల్లో కాచిగూడ- కర్నూల్ సిటీ(07109), కర్నూల్‌సిటీ- కాచిగూడ (07110), 24, 25, 26, 27 తేదీల్లో హుబ్లీ- కర్నూల్ సిటీ (07315), 25, 26, 27, 28 తేదీల్లో కర్నూల్‌సిటీ- హుబ్లీ(07316) ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

సికింద్రాబాద్-వాడిల మధ్య 4 లైన్‌ల ట్రాక్ కోసం స్థల సేకరణ


హైదరాబాద్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య నాలుగు లైన్‌లుగా విస్తరించే పనులు చేపట్టడానికి అవసరమైన స్థలాన్ని సేకరించే పనులను దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. ప్రధానంగా సనత్‌నగర్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య సుమారు 173.18 కిమీ దూరం భవిష్యత్ అవసరాలకు మూడు నుంచి నాలుగు లైన్‌ల ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు రైల్వే బోర్డు ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టడానికి అనుమతించింది. ఈ మేరకు తెలంగాణలోని హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు కర్ణాటకలోని కలబురిగి జిల్లాల్లో ప్రతిపాదించిన భూమిని ఆయా జిల్లా కలెక్టర్‌ల సహకారంతో సేకరించనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

'మత్తు' నిర్మూలనలో యువత భాగస్వామ్యం

- యూనివర్సిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులకు టీజీ న్యాబ్ అవగాహన

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల కట్టడి, నిర్మూలనలో తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) యువతను భాగస్వామ్యం చేస్తోంది. అందులో భాగంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ)లో రెండు రోజులపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు నవంబరు 27, 28న రెండు విడతలుగా టీజీ న్యాబ్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల్ని కూకటివేళ్లతో నిర్మూలించేందుకు ఈ తరహా అవగాహనా కార్యక్రమాలు ఉపయోగపడతాయని అధికారులు వెల్లడించారు.

పర్యాటకుల కోసం గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలు



గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలులో రెస్టారెంట్

హైదరాబాద్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన ప్రయాణంతో విహారయాత్రలకు వెళ్లి వచ్చే పర్యాటకుల కోసం ఇండియన్ రైల్వే కాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును అందుబాటులోకి తీసుకువచ్చింది. 80మంది విలాసవంతంగా ప్రయాణించేలా 13 డబుల్ బెడ్‌ల క్యాబిన్‌లు, 26 ట్విన్‌బెడ్‌డ్ క్యాబిన్‌లతోపాటు అత్యంత ఆధునిక సదుపాయాలతో విహారయాత్రలకు వెళ్లి వచ్చేందుకు ఐఆర్‌సీటీసీ గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును సిద్ధం చేసింది. అన్నిరకాల చానెళ్ల తిలకించేందుకు టీవీలను క్యాబిన్‌లో ఏర్పాటు చేసింది. వినోదం, విశ్రాంతికోసం రైలులో ప్రత్యేకంగా స్పా, స్పాథెరపీ ఏర్పాట్లున్నాయి. రుచి, నలపాక్ పేరుతో రెండు అద్భుతమైన రెస్టారెంట్‌లు అందుబాటులో ఉన్నట్టు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ఇందులో స్థానిక రుచికరమైన వంటకాలతోపాటు మద్యం ప్రియులకు అవసరమైన రకరకాల పానీయాలను సైతం ఇక్కడి బార్‌లో ఉంటాయని వివరించారు. ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ బెంగళూరు నుంచి బందీపూర్, మైసూర్, హళేబీడు, చిక్కమంగళూరు, హంపి, గోవా సందర్శించిన తర్వాత తిరిగి ఆరు రోజుల్లో బెంగళూరు చేరుకునేందుకు అనువుగా టూర్ ప్యాకేజీ ఖరారు చేశారు. అలాగే జువెల్స్ ఆఫ్ సౌత్ ప్యాకేజీలో బెంగళూరు నుంచి మైసూర్, కాంచీపురం, మహాబలిపురం, తంజావూరు, చెట్టినాడ్, కొచ్చిన్, చేరాలా ప్రాంతాలను సందర్శించి ఆరు రోజుల్లో తిరిగి బెంగళూరుకు చేరుకునేందుకు వీలుగా మరో ప్యాకేజీ ప్రకటించారు. గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలు డిసెంబర్ 14న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, డిసెంబర్ 21న జువెల్స్ ఆఫ్ సౌత్, 2025 జనవరి 4, ఫిబ్రవరి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, టూర్ ఫిబ్రవరి 15న జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్, మార్చి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ నిర్వహిస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. వివరాలకు 91 8585931021, లేదా వెబ్‌సైట్ www.goldenchariot.org, Ema-il: goldenchariot@irctc.com సంప్రదించాలని అధికారులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో కళాకారులకు స్వాగతం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, (ఆంధ్రజ్యోతి): శిల్పా కళారామంలో లోకమంథన్ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి పశ్చిమబెంగాల్, మణిపూర్ కళాకారులు రైలులో గురువార సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. వారికి బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి స్వాగతం పలికారు. ప్రగ్యా భారత్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ విభాగం 2 నెలలుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు శిల్పారెడ్డి తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు రైలుమార్గంలో సికింద్రాబాద్ స్టేషన్‌లో దిగిన తర్వాత శిల్పరామానికి వెళ్లేందుకు సూచనలు ఇస్తున్నామన్నారు.



ఎమ్మెల్యే పద్మారావుతో మాట్లాడుతున్న ఆశా వర్కర్లు

ఉద్యోగ భద్రత కల్పించాలి

రెజిమెంటల్‌బజార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్ ప్రతినిధుల బృందం కోరింది. గురువారం సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను, డిమాండ్లను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికికృషి చేస్తానని పద్మారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

23న కలెక్టర్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో బీసీ ప్రత్యేక సమావేశం

అడ్డగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాల సమస్యలు, సలహాలు సూచనలు ఇవ్వడానికి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్ తెలిపారు. ఈ నెల 23న కలెక్టర్ కాన్ఫరెన్స్ కార్యాలయ ఆవరణలో బీసీ కమిషన్ సభ్యుడు నిరంజన్ ఆధ్వర్యంలో బీసీ సమావేశం నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఉన్న బీసీ కులాల సమస్యలు ఇతరత్రా అంశాలపై సూచనలు ఇవ్వొచ్చని తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం మొదలవుతుందని, బీసీ సంఘాలు పాల్గొనవచ్చని తెలిపారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న కోట నీలిమ

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత: కోట నీలిమ

సికింద్రాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. కళాసిగూడలోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాలుపైన భక్తులు అయ్యప్ప మాల ధరించడం కోసం షెడ్డు నిర్మాణం గురువారం జరిగింది. తన వంతు సహాయంగా కోట నీలిమ రూ.16 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించని నల్లా కనెక్షన్ల తొలగింపు

రెజిమెంటల్‌బజార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సకాలంలో బిల్లులు చెలించని నల్లా కనెక్షన్లను వాటర్ వర్క్స్ అధికారలు తొలగించారు. గురువారం రెజిమెంటల్ బజార్‌లోని లాడ్జీలు, హోటళ్లలో బిల్లు చెల్లించకపోవడతో ఎనిమిది నల్లా కనెక్షన్‌లను తొలగించినట్టు వాటర్ వర్క్స్ అధికారి పీ అండ్ ఏ దేవిదాస్ తెలిపారు. దాదాపు లక్ష రూపాయలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. బకాయిలో కొంతశాతం రాయితీ ఇచ్చి మిగతా బిల్ చెల్లించమన్నా, చెల్లించక పోవడంతో నల్లా కనెక్షన్ డిస్‌కనెక్ట్ చేసినట్లు దేవిదాస్ తెలిపారు. కార్యక్రమంలో జీపీసీ ఓంప్రకాశ్, నల్లా మీటర్ రీడింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భాస్కరాచారి నియామకం పట్ల విశ్వకర్మ మనుమయసంఘం హర్షం

బౌద్ధనగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ మనుమయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగవరం భాస్కరాచారి నియామకం పట్ల సికింద్రాబాద్ విశ్వకర్మ మనుమయ సంఘం హర్షం వ్యక్తం చేసింది. విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి భాస్కరాచారి నిరంతరం పాటుపడతారని పలువురు కొనియాడారు. గురువారం సీతాఫల్‌మండి మధురానగర్‌కాలనీలో సంఘం కార్యాలయంలో భాస్కరాచారిని వారు సత్కరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కుందారం గణేశ్‌చారి, రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పుల్లోజు అశోక్‌చారి, ఎర్రవల్లి బాలాచారి తాటికొండ శ్రీరాములు పాల్గొన్నారు.

'రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకోనివ్వండి'

చిలకలగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకోనివ్వండని చిరువ్యాపారులు కోరుతున్నారు. సీపీ ఆదేశాల మేరకు చిలకలగూడ పోలీసులు ఆలుగడ్డ బావి నుంచి రైల్వే డిగ్రీ కాలేజీ వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, కూరగాయల బండ్లు, టిఫిన్ సెంటర్ల వ్యాపారాలను అనుమతించకుండా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో చిరువ్యాపారాలు చింతా రమేష్, కలువల గంగా, యాకూబ్ మాట్లాడుతూ 12 ఏళ్లుగా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా రోడ్డుపక్కన వ్యాపారాలు చేసుకుంటున్నామన్నారు. అకస్మాత్తుగా వ్యాపారాలు మానివేస్తే కుటుంబ పోషణ కష్టతరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల ఆనారోగ్యంతో మరణించిన చిరువ్యాపారి లలిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోయిన్‌పల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ పనుల నిమిత్తం విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నామని డీఈ లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాంగోపాల్ ఎన్‌క్లేవ్, మారుతీనగర్, సాయిబాబా కాలనీ, సిండికేట్ బ్యాంకు కాలనీ, ఎన్ఆర్ఎస్ఐ, సాయికృష్ణ కాలనీ, దుబాయ్ గేట్ ప్రాంతాలలో.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాపూజీనగర్, భావనకాలనీ, ధనలక్ష్మి కాలనీ, మలాని కాలనీ, నల్లపోచమ్మ ఆలయం మెయిన్‌రోడ్డు, పంచవటికాలనీ, మహాత్మానగర్ మెయిన్‌రోడ్డు, పార్క్ వెవ్యూ ఎన్‌క్లేవ్, అబ్రార్‌నగర్, మనోవికాస్‌నగర్, రాయల్ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.